# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



# చిత్తూరు

జిల్లా వార్తలు

ఆదివారం 2 ఫిబ్రవరి 2025




కేంద్ర బడ్జెట్ ప్రధానంగా మూడు నాలుగు వర్గాలకు ప్రయోజనం కలిగించింది. ఆదాయ పన్ను పరిమితిని పెంచడంతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, అలాగే వ్యాపార వర్గాలపై పన్ను భారం తగ్గనుంది. పీఎం కిసాన్ కార్డులు కలిగిన రైతులకు రుణ పరిమితి పెంచడం వల్ల వారికి అధిక మొత్తం రుణాలు అందనున్నాయి. ఎంఎస్ఎంఈలకు సైతం కొత్త బడ్జెట్‌లో రుణ పరిమితిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

**- చిత్తూరు,ఆంధ్రజ్యోతి**



# మధ్య తరగతి మందహాసం

## ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారుల్లో ఆనందం

## రైతులకు, చిన్న పారిశ్రామికవేత్తలకు పెరిగిన రుణ పరిమితి

### ● 16,735మంది రైతులకు రుణ పరిమితి పెంపు



రైతులు పంట సాగు కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. కిసాన్ క్రెడిట్ కార్డులున్న వారికి రూ.5 లక్షల దాకా రుణాలు దొరకనున్నాయి.రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో మన జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్న 16,735 మంది రైతులకు లబ్ధి కలగనుంది.

### ● 18 వేలమంది ఉద్యోగులకు పన్ను మినహాయింపు



ఉద్యోగులు ఏడాదికోసారి తమ నెల జీతాన్ని పన్ను రూపంలో చెల్లించాల్సిన అవసరం ఉండదు. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించారు.జిల్లాలో 22 వేలమంది ఉద్యోగులుండగా.. బేసిక్ రూ.65 వేల కంటే తక్కువగా ఉన్న సుమారు 18 వేల మంది ఉద్యోగులకు పన్ను మినహాయింపు లభించనుంది. ప్రైవేటు ఉద్యోగులందరికీ దాదాపుగా మినహాయింపు ఉన్నట్టే.

### ● 903 ఎంఎస్ఎంఈ యూనిట్లకు వరాలు

సూక్ష్మ, స్వల్ప, మధ్య తరహా పరిశ్రమలు నడిపే పారిశ్రామికవేత్తలకు, అలాంటి చిన్న తరహా యూనిట్లు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు రుణ పరిమితిని రెట్టింపు చేశారు. ఇప్పటివరకూ ప్రభుత్వం రూ. 5 కోట్ల వరకూ రుణాలు అందిస్తోంది. అయితే కొత్త బడ్జెట్‌లో ఆ రుణ పరిమితిని రూ. 10 కోట్లకు పెంచింది. మన జిల్లాలోనూ ఎంఎస్ఎంఈలను గుర్తించేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో సర్వే జరుగుతోంది. మన జిల్లాలో 903 ఎంఎస్ఎంఈ మానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉండగా.. అర్హతను బట్టి రూ.10 కోట్ల వరకు రుణాలు పొందే అవకాశాలున్నాయి.





### ● 2239మంది క్యాన్సర్ రోగుల యోగక్షేమాల కోసం..

క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని జిల్లా ఆస్పత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. జిల్లాలో 2239 మంది క్యాన్సర్ రోగులుండగా.. ఈ డే కేర్ సెంటర్లలో వారంతా కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ వంటి సేవల్ని పొందవచ్చు. ప్రత్యేకంగా వైద్యులు, ఇతర సిబ్బందిని కూడా కేటాయిస్తారు.

### అందరికీ ఆమోదయోగ్యం

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజలందరికీ ఆమోద యోగ్యమైంది.మన రాష్ట్రానికి కూడా వరాల జల్లు కురిపించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా బడ్జెట్ కేటాయింపులున్నాయి. రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం అంచనా సవరించేందుకు కేంద్రం ఆమోదం తెలపడం హర్షణీయం.

**- దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎంపీ**

### వేతన జీవులకు ఊహించని ఊరట

వేతనం మీద ఆధారపడే ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కేంద్ర బడ్జెట్ ఊహించని ఊరట అనేచెప్పాలి. ఆదాయ పన్ను స్లాబు రేట్లు పెంచడం ఒక నెల నుంచి రెండు నెలల జీతాన్ని ఆదాయ పన్ను రూపంలో చెల్లిస్తున్న ఉద్యోగులకు తీపి వార్త.ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగులందరికీ కేంద్ర ప్రభుత్వం అందించిన బిగ్ బోనాంజా అనే చెప్పాలి.

**- బాలాజి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు**

### జవాబుదారీతనంగా..!

వ్యవసాయ, వైద్య, విద్యా రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత లభించింది. మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశానికి, ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరిస్తోందనడానికి బడ్జెట్ మంచి ఉదాహరణ.

**-శ్రీనివాసులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి**

### ఊహించని ఊరట

ఎన్నడూ లేని విధంగా ట్యాక్స్ మినహాయించారు. రూ.5 లక్షల కంటే ఎక్కువ ఇవ్వరనుకున్నాం. ఊహించిన దాని కంటే ఎక్కువగా ఇచ్చారు. ఈ లెక్కన గ్రూప్ 4, అంతకంటే తక్కువ స్థాయి ఉద్యోగులకు ఎలాంటి ట్యాక్స్ ఉండదు. బేసిక్ రూ.65 వేల కంటే పైనున్న పైస్థాయి ఉద్యోగులకు కూడా ఏడాదికి గరిష్ఠంగా రూ.20 వేల కంటే ఎక్కువగా ట్యాక్స్ ఉండదు.

**- కేవీ రాఘవులు, ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు**

### ఆదాయపరిమితి పెంపు హర్షణీయం

కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు ఊరట లభించింది.వృద్ధులకు వడ్డీపై ఆదాయాన్ని రూ. 50 వేల నుంచి 2లక్షలకు, అద్దెలపై వచ్చే ఆదాయాన్ని 2నుంచి 6లక్షలకు పెంచడం శుభ పరిణామం. దీనిద్వారా మార్కెట్‌లో వినియోగం పెరుగుతుందన్నారు. అయితే ప్రామాణిక తగ్గింపును రూ. 75వేలుగానే కొనసాగించడం సరికాదు. దీనిని కనీసం రూ. 1.5 లక్షలకు పెంచాలి. ఏపీకి కేటాయింపులు పెంచకపోవడం విచారకరం.

**- ఎన్.సోమచంద్రారెడ్డి,యూటీఎఫ్ నాయకుడు**

### రైతాంగ వ్యతిరేక విధానాలకు పరాకాష్ట

రైతాంగ ప్రయోజనాలకు కేంద్ర బడ్జెట్ ఏమాత్రం అనుకూలంగా లేదు.జిల్లాకు మామిడి బోర్డు విషయంలో రాష్ట్రప్రభుత్వం, స్థానిక ఎంపీ హామీలను కేంద్రం పట్టించుకోలేదు. సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునఃప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించలేదు.

**- విజయానందరెడ్డి, వైసీపీ చిత్తూరు ఇన్‌ఛార్జి**

### పన్ను మినహాయింపు శుభ పరిణామం

దేశంలోని మెజారిటీ ప్రజలకు పన్ను మినహాయింపు ఇవ్వడం గొప్ప నిర్ణయం.సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి ఈ బడ్జెట్ దోహద పడుతుంది. ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా ఈ నిర్ణయం మంచి ప్రయోజనాన్ని కల్గిస్తుంది.

**- కె.సునీత, ఎకనమెట్రిక్స్ విభాగం, ఎస్వీయూ**

### అన్నదాతకు చేయూత

అన్నదాతను ఆదుకునేలా, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేలా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో రైతులకు రుణాలు అందించి వారికి ఆర్థిక భరోసాను కల్పించింది. వ్యవసాయ రంగానికి, అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం.


**- సీఆర్ రాజన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

# పుస్తకాల పండుగ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పుస్తకాల పండుగ ప్రారంభమైంది. పది రోజుల పాటు సాగే 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు చదవడం వల్ల మనుషుల్లో సమాజం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాలన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద మాట్లాడుతూ పుస్తక అధ్యయనం నుంచే సామాన్యులు అసామాన్య స్థాయికి ఎదిగారని అన్నారు. సభాధ్యక్షుడు, తిరుపతి పుస్తక ప్రదర్శన నిర్వాహకులు, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ పుస్తకాలు మనుషుల్లోని మనోమాలిన్యాన్ని తొలిగిస్తాయన్నారు.

**నేడు సంగీత గేయావధానం**

పుస్తక ప్రదర్శనలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు సారంగపాణి వేదికపై నిర్వహించే సభలో వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణీసదాశివ మూర్తి పాల్గొంటారు. ప్రముఖ సాహిత్య పరిశోధకులు, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వెలుగోటి సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయావధానం నిర్వహిస్తారు.



పుస్తకాలను తిలకిస్తున్న జస్టిస్ శ్రీకృష్ణ, ఆర్వీ కుమార్, సత్యనారాయణరాజు తదితరులు

# సామాన్య భక్తులకు ప్రాధాన్యం

- అందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం
- మహిళలకు పసుపు కుంకుమ
- మహాశివరాత్రి వేడుకలపై మంత్రుల సమీక్ష

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులను సంతృప్తికర దర్శనం కల్పించడమే లక్ష్యమని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై శనివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ వివరాలను మంత్రులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా నిర్వహిస్తామన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ఉత్సవాల్లో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. మహిళలకు జ్ఞానప్రసూనాంబిక అనుగ్రహ ప్రసాదంగా రవిక, గాజులు, పసుపు, కుంకుమను సారెగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వీవీఐపీ, వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించామన్నారు. పిల్లలు తప్పిపోతే సులభంగా గుర్తించేలా జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున పట్టువస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబును ఆహ్వానించామన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డు నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించేందుకు అనుమతించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ఈవో బాపిరెడ్డి, నాయకులు టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

**స్థానికులకు ఉచిత దర్శనం**

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికులకు శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనాన్ని ఉచితంగా కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శివరాత్రి మరుసటి రోజున స్థానికుల కోసం ప్రత్యేకంగా ఉచిత క్యూలైన్ విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి 24 మంది సభ్యులతో సేవా సమితిని ఏర్పాటు చేస్తామన్నారు.

# ఎరువుల కోసం బారులు



పెనుమూరులో ఎరువుల దుకాణం వద్ద క్యూలో నిలబడిన రైతులు

పెనుమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద శనివారం ఉదయం ఏడు గంటలకే రైతులు బారులు తీరారు. సుమారు 400 మంది రైతులు రోడ్డుపై క్యూలైన్లో నిలబడటంతో ట్రాఫిక్ స్తంభించింది. 20 రోజులుగా మండలంలో ఎరువుల కోసం దుకాణాల వద్దకు రైతులు ఎగబడుతున్నారు. ఎప్పుడూ లేనివిధంగా అన్‌సీజన్‌లో విరివిగా వర్షాలు కురవడంతో ఎక్కువమంది రైతులు పంటల సాగు ప్రారంభించారు. మండలంలో 1,112 ఎకరాల్లో పంట వేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులు క్యూకట్టిన విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏడీఏ ఉమ, మండల వ్యవసాయ అధికారి మధురవాణి దుకాణం వద్దకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడి టోకెన్లు ద్వారా ఎరువులను పంపిణీ చేశారు. పోలీసులతో మాట్లాడి తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ అధికారులు కుసుమ, ఢిల్లీబాబు, అములు, తులసి పాల్గొన్నారు. కాగా, పెనుమూరు మండల రైతులు మాత్రమే కాకుండా వెదురుకుప్పం,పూతలపట్టు, జీడీనెల్లూరు, పాకాల మండలాల నుంచి కూడా పెద్ద ఎత్తున రావడంతో రద్దీ నెలకొంది. ఆదివారం కూడా 36 మెట్రిక్ టన్నులు మండలానికి వస్తుందని రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని వ్యవసాయాధికారి తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న మురళీ కృష్ణ

## యూరియా కొరత లేదు

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.'జిల్లాలో 2,500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. వారం రోజులుగా స్పీక్ 250 మెట్రిక్ టన్నులు, కోరమాండల్ యూరియా 400 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చింది. వారంలోపు ఐపీఎల్‌కు చెందిన 400మెట్రిక్ టన్నుల యూరియా, 780 మెట్రిక్ టన్నుల 20-20-0-19, స్పీక్‌కు చెందిన 576 మెట్రిక్ టన్నులు, డీఏపీ 512 మెట్రిక్ టన్నులు, 256 మెట్రిక్ టన్నుల 20-20-0-13 జిల్లాకు చేరుతుందన్నారు. పశుగ్రాసం కోసం యూరియాను వాడరాదని రైతులకు ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

# 'బి' గ్రేడ్‌తో సరి!

● న్యాక్ ప్రామాణికతను అందుకోలేకపోయిన ద్రావిడ వర్సిటీ అధికారులు

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల కూడలిలో వెలసిన ద్రావిడ విశ్వవిద్యాలయం 'పేరు గొప్ప..' అన్న పరిస్థితికి చేరింది. తాజాగా న్యాక్ ఇచ్చిన 'బి' గ్రేడ్ కూడా గొప్పేనని చెప్పుకోవాల్సిన అగత్య వర్సిటీ అధికారులకు పట్టింది. ఉన్న గ్రేడ్‌నుంచి మరీ దిగువకు వెళ్లిపోలేదు కదా.. అన్న సంతృప్తి మాత్రమే వారికి మిగిలింది. ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని ఈనెల 21, 22, 23 తేదీల్లో న్యాక్ బృందం సందర్శించింది. రెండు బృందాలుగా విడిపోయిన కమిటీ సభ్యులు విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర, ఇతర కార్యకలాపాల తీరును అంచనా వేశారు. వారి అంచనాలు కేవలం 'బి' గ్రేడ్‌కు మాత్రమే ద్రావిడ వర్సిటీని పరిమితం చేసేందుకు ప్రేరేపించాయి. ఇలా 'బి' గ్రేడ్‌నుంచి 'ఎ' గ్రేడ్‌కు కాదు కదా, కనీసం 'బి' ప్లస్ గ్రేడ్‌కు కూడా చేరలేక వర్సిటీ చతికిలబడడం, అధికార యంత్రాంగం అసమర్థ నిర్వహణ వల్లేనని వర్సిటీ వర్గాలే తప్పు పడుతున్నాయి. ద్రావిడ వర్సిటీకి ఏళ్ల తరబడి కొనసాగుతున్న అవలక్షణాలు చాలానే ఉన్నాయి. దూరవిద్య విధానంలో విచ్చలవిడిగా పీహెచ్‌డీలు, ఎంఫిల్‌లు ప్రదానం చేయడం, వాటికి ఇతర ప్రాంతాల్లో కనీసమైన విలువ లేకపోవడం ఇందులో ప్రధానమైది.



యూజీసీ నిబంధనలను ధిక్కరించి ప్రదానం చేసిన ఈ డిగ్రీలపై ఇప్పటికీ వివాదం నడుస్తోంది. అనంతర కాలంలో దూర విద్యా విభాగాన్ని రద్దు చేసినా సరే, అప్పటి పాపం విశ్వవిద్యాలయాన్ని వెన్నాడుతూనే ఉంది. అధికారులు కోర్టు కేసులు ఎదుర్కొంటూనే ఉన్నారు. గతంలో పనిచేసిన ఇద్దరు ముగ్గురు వీసీలు అధ్యాపక శ్రేణిలో అర్హతలు పరిగణించకుండా పదోన్నతులు కల్పించారని, పరిమితికి మించిన అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకున్నారని విమర్శలు ఉండనే ఉన్నాయి.

**● న్యాక్ ముందు సైతం తడబాటే**

సవాలక్ష లోపాలతో కొనసాగుతున్న ద్రావిడ విశ్వవిద్యాలయం పరిపాలన, బోధనా విభాగాల పనితీరు చెప్పుకున్న స్థాయిలో లేకపోవడం కూడా గ్రేడ్ పెరగకపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. న్యాక్ బృందం ముందు సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశాలను అధికార యంత్రాంగం సద్వినియోగం చేసుకోలేక పోయింది. న్యాక్ రూపొందించిన ప్రశ్నావళిలో అతి పరిమితమైన వాటికి మాత్రమే విశ్వవిద్యాలయం బాధ్యులనుంచి సంతృప్తికర సమాధానాలు లభించాయని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఒక ప్రతిష్ఠాత్మక కోర్సుకు చెందిన అధ్యాపకుడొకరిని తమ డిపార్టుమెంటు సాధించిన ప్రగతి గురించి న్యాక్ బృందం చెప్పమంటే చేతులెత్తేశారని సాటి అధ్యాపకులే చెవులు కొరుక్కుంటున్నారు. ఇతర కోర్సుల విషయంలో కూడా న్యాక్ బృందం ముందు ఇదేరకమైన 'ప్రతిభ' కనబరచినట్లు సమాచారం. ఇక పరిశోధనా రంగంలో సాధించిన ప్రగతి గురించి కూడా సరైన వివరాలను వర్సిటీ అధికార యంత్రాంగం న్యాక్ బృందానికి అందించలేకపోయింది. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ)కి సంబంధించి గత అయిదేళ్ల రిజిస్టర్ నిర్వహించాల్సి ఉండగా కేవలం ప్రస్తుత విద్యా సంవత్సరం వివరాలు మాత్రమే సమర్పించిన అధికారుల పనితీరుపై న్యాక్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. గత పాపాలకు తోడు, సామర్థ్యాన్ని నిరూపించుకోవడంలో న్యాక్ కమిటీ ముందు అధికార, బోధన యంత్రాంగం చూపిన తడబాటు ద్రావిడ వర్సిటీని కేవలం 'బి' గ్రేడ్‌కు మాత్రమే పరిమితం చేసింది. ఉన్న గ్రేడ్‌ను నిలుపుకోవడమే పెద్ద గొప్పగా భావిస్తున్న వర్సిటీ అధికారులు ఉన్నంత వరకకూ ఉన్నతమైన న్యాక్ గ్రేడ్ సాధించడం కల్లేనని వర్సిటీలోనే కొన్ని వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

**● విద్యార్థులేరీ?**

ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2024-25వ విద్యా సంవత్సరంలో 13 పీజీ కోర్సులు, డిగ్రీ కోర్సులు కొనసాగుతున్నాయి. పీజీ కోర్సుల్లో మొత్తం 366 సీట్లుండగా, కేవలం 201 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. డిగ్రీ కోర్సుల్లో మొత్తం 554 మంది విద్యార్థులకు గాను కేవలం 284 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. తుళు, భాషా శాస్త్రం, జానపద గిరిజన అధ్యయన శాఖలకు చెందిన పీజీ కోర్సుల్లో అసలు విద్యార్థులే లేరని, సంబంధిత డిగ్రీ కోర్సుల్లో సైతం ఐదుగురు, అంతకంటే తక్కువే విద్యార్థులున్నట్లు సమాచారం. ఇతర వర్సిటీల్లో అత్యంత ఆదరణ కలిగిన మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సుల్లో సైతం సగం మాత్రమే భర్తీ అయ్యాయి. ఒక్కో కోర్సులో 30 సీట్లుండగా పైన పేర్కొన్న మూడు కోర్సుల్లో వరుసగా 19, 23, 14 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. బోధనలో నాణ్యతా ప్రమాణాలు లోపించడంవల్లే ద్రావిడ విశ్వవిద్యాలయంలో కోర్సులకు ఈ దుస్థితి ఏర్పడిందన్నది బహిరంగ రహస్యం. ఇక ప్లేస్‌మెంట్ల విషయంలో సైతం చాలా పూర్‌గా ఉంది. ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో ద్రావిడ వర్సిటీ విద్యార్థులు ఉద్యోగాలు పొందిన దాఖలాలు దాదాపు లేవనే చెప్పొచ్చు. విద్యార్థుల నైపుణ్యాలను పెంచడం ద్వారా వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి సాయపడే యూజీసీ కెరీర్ రిసోర్స్ సెంటర్ పేరుకు మాత్రమే ఉంది. నెట్, స్లెట్, వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. దీన్ని సరిగా వినియోగించుకునే దిక్కు లేకుండా పోయింది.

## తొలి రోజు 96 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ తొలి రోజైన శనివారం జిల్లాలో 96 శాతం పూర్తయ్యింది. 2,65,698 మందికిగాను 2,55,223 మందికి పింఛన్ల కింద రూ.108.32కోట్లు అందజేశారు. 10,475 మందికి పంపిణీ చేయాల్సి ఉంది.

# బైరాగిపట్టెడలో తొక్కిసలాటపై ప్రారంభమైన న్యాయ విచారణ

**బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సత్యనారాయణమూర్తి**

**ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్న కమిషన్**



పద్మావతీ పార్కు వద్ద తొక్కిసలాట వివరాలను తెలుసుకుంటున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

తిరుపతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గత నెల 8వ తేదీన వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగి 40 మందికి పైగా భక్తులు గాయపడి, ఆరుగురు భక్తులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు న్యాయ విచారణ ప్రారంభమైంది. విచారణ కమిషన్‌గా నియమితులైన ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే న్యాయ విచారణ ప్రక్రియను ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. పద్మావతీ అతిథి గృహంలో బస చేసిన ఆయన శనివారం ఉదయం తిరుమల వెళ్ళి శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12గంటలకు తిరుపతి కలెక్టరేట్ చేరుకున్నారు. కలెక్టరేట్‌లోని నాలుగో అంతస్తులో 413వ నంబరు గదిని విచారణ కమిషన్ కార్యాలయం కోసం ప్రభుత్వం కేటాయించింది. అక్కడికి చేరుకున్న సత్యనారాయణమూర్తి తొలుత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొక్కిసలాట ఘటనపై ఇప్పటికే వివిధ విభాగాల నుంచీ ప్రభుత్వానికి అందిన నివేదికలతో కూడిన సమాచారాన్ని ప్రాథమికంగా పరిశీలించారు. ఆపై విచారణకు పిలవాల్సిన అధికారులు, ఉద్యోగులు, ఇతర వ్యక్తుల జాబితా రూపొందించుకున్నారు. విచారణకు హాజరు కావాల్సిందిగా వారికి సమన్లు, నోటీసులు సిద్ధం చేయించారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లోని కార్యాలయం నుంచీ బయల్దేరి తొక్కిసలాట ఘటన జరిగిన బైరాగిపట్టెడ పద్మావతీ పార్కు వద్దకు చేరుకున్నారు.

### తొక్కిసలాట ఘటన వివరాల సేకరణ

పద్మావతీ పార్కు చేరుకున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి తొలుత తొక్కిసలాట జరిగిన ప్రధాన గేటును, పక్కనే వున్న చిన్న గేటును పరిశీలించారు. పార్కులోకి భక్తుల రాకపోకలకు వీలు కల్పించే గేట్లు ఇవేనా? పెద్దగేటును, చిన్న గేటును ఏయే సందర్భాల్లో వినియోగిస్తారు? అని సిబ్బందిని ప్రశ్నించారు. తిరుపతి అర్బన్ మండల సర్వేయర్ జగదీష్‌తో రెండు గేట్లు ఎంత వెడల్పు వున్నదీ కొలతలు తీయించారు. గత నెల 8వ తేదీన భక్తులు పార్కులోకి ఏ గేటు ద్వారా వెళ్ళారు? వెలుపలికి ఏ గేటు ద్వారా వచ్చారు? అలాగే పార్కు నుంచీ టోకెన్లు జారీ చేసే కౌంటర్లకు ఎలా వెళ్ళారు? అని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పార్కు మెయిన్ గేటు నుంచీ పక్కనే వున్న రామానాయుడు మున్సిపల్ హైస్కూలు వరకు బ్యారికేడ్ల ఏర్పాటు ఎలా జరిగిందన్న దానిపై వివరాలు సేకరించారు. పార్కు నుంచీ స్కూలు వరకూ ఐదు అడుగుల వెడల్పుతో రెండు క్యూ లైన్లు, స్కూలు వద్ద నుంచీ కౌంటర్ల వరకూ మాత్రం ఐదు అడుగుల వెడల్పుతో ఒకే క్యూ లైన్ ఏర్పాటు చేసిన సంగతి నమోదు చేసుకున్నారు.కౌంటర్లకు ఒకే క్యూ లైన్ ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. అయితే తొక్కిసలాట జరిగింది స్కూల్లో కాదని, పార్కు మెయిన్ గేటు వద్ద అని జస్టిస్ సత్యనారాయణమూర్తికి సిబ్బంది తెలియజేశారు. అనంతరం మెయిన్ గేటు వద్దనుంచీ నడుచుకుంటూ ఆయన రామానాయుడు స్కూలు మైదానంలోకి వెళ్ళారు. టోకెన్లు తీసుకున్న భక్తులు స్కూలు ఆవరణ నుంచీ వెలుపలికి వెళ్ళే మార్గం గురించి ఆరా తీశారు. పార్కు మెయిన్ గేటు నుంచీ స్కూలు వరకూ ఏర్పాటు చేసిన క్యూలైన్ల కొలతలు, అలాగే స్కూల్లో మైదానం పొడవు, వెడల్పుతో కూడిన స్కెచ్‌లు సిద్ధం చేసి తనకు వెంటనే అందజేయాలని అధికారులను సత్యనారాయణమూర్తి ఆదేశించారు. అనంతరం ఘటనా స్థలం నుంచీ పద్మావతీ అతిథి గృహానికి బయల్దేరి వెళ్ళారు.

### అధికారులకు దూరంగా...

శుక్రవారం రాత్రి తిరుపతి వచ్చిన జస్టిస్ సత్యనారాయణమూర్తి అధికారులకు దూరంగా వున్నారు. శుక్రవారం రాత్రి పద్మావతీ అతిథి గృహం వద్ద కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు ఆయనకు స్వాగతం పలికారు. అది మినహా మరెక్కడా మరే ఇతర అధికారులూ ఆయనను కలిసే ప్రయత్నం చేయలేదు. కలెక్టరేట్‌లో తనకు కేటాయించిన కార్యాలయం వద్ద కూడా ఆయన మీడియాను కలిసేందుకు కూడా అంగీకరించలేదు. కేవలం బాధ్యతలు చేపట్టే సందర్భంలో ఫొటోలు తీసుకోవడానికి మాత్రమే అనుమతించారు. ఆ సందర్భంగా విచారణ వ్యవధి, ప్రక్రియలపై వివరాలు అడిగినా ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సైతం ఇతర అధికారుల రాకపోకలు కనిపించలేదు. కేవలం తనకు కేటాయించిన సిబ్బందితోనే అవసరమైన సమాచారం విశ్లేషించడం, సమన్లు, నోటీసులు తయారు చేయడం చేశారు.అంతేకాకుండా ఘటనా స్థలాన్ని సందర్శించినపుడు కూడా ఆయన వెంట కార్యాలయ సిబ్బంది మినహా పోలీసు, రెవిన్యూ, టీటీడీ, టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాలకు చెందిన అధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం. గాలేరు-నగరి భూసేకరణ విభాగం రెండవ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుధారాణిని ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌కు కార్యదర్శిగా నియమించింది.అలాగే ఓ డిప్యూటీ తహసిల్దార్‌ను లైజన్ ఆఫీసర్‌గా, రెవిన్యూ శాఖకే చెందిన కింది స్థాయి ఉద్యోగిని స్టెనో కమ్ టైపిస్టుగా నియమించింది.

### అధికారుల్లో గుబులు

తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వ అభ్యర్థనతో న్యాయ విచారణ ప్రారంభం కావడంతో కీలక బాధ్యతలు నిర్వర్తించిన అధికారులు, ఘటన జరిగిన రోజు సంబంధిత ప్రదేశంలో విధుల్లో వున్న అధికారులు, ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వం పోలీసు, నిఘా వర్గాల ద్వారా ఆ రోజు ఏం జరిగింది? ఎవరు ఎంతవరకూ బాధ్యులు, కారకులు? అన్న దానిపై విచారణ జరిపించి నివేదికలు తెప్పించుకుంది. ఘటన జరిగిన మరుసటి రోజున ప్రాథమిక సమాచారంతోనే బైరాగిపట్టెడ కేంద్రం వద్ద విధుల్లో వున్న డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి సస్పెన్షన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రత్యక్షంగా అక్కడ విధుల్లో లేకపోయినా మొత్తంమీద పర్యవేక్షణా బాధ్యత కలిగిన ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభిప్రాయంతో వారిని బదిలీ చేశారు. సీఎం చంద్రబాబు తిరుపతి వచ్చి వెళ్ళాక సీనియర్ ఐపీఎస్ అధికారులతో విచారణ చేయించి ఘటనకు కారణాలు, అధికారుల వైఫల్యాలపై సమగ్ర నివేదిక తెప్పించుకున్నారు. అయినా సంతృప్తి చెందని ముఖ్యమంత్రి న్యాయ విచారణకు ఆదేశించారు. ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, నిఘా విభాగం అధికారులు, టీటీడీ అధికారులు, రెవిన్యూ అధికారులతో విచారణలు జరిపితే ఏదో ఒక స్థాయిలో బాధ్యులను, కారకులను తప్పించే ప్రయత్నాలు జరిగే అవకాశాలను కొట్టిపారవేయలేని పరిస్థితి. అయితే హైకోర్టు రిటైర్డు జడ్జితో న్యాయ విచారణ మొదలు కావడం, కమిషన్ అధికారులను దూరంగా పెట్టడంతో తొక్కిసలాట ఘటన జరిగిన రోజున విధుల్లో వున్న అధికారులు, ఉద్యోగుల్లో కలవరపాటు మొదలవుతోంది. మొత్తంగా పర్యవేక్షణ బాధ్యత కలిగిన పై స్థాయి అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించామన్న ఆరోపణలను ఎదుర్కోనాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

## ఎస్సీ, బీసీ, మైనారిటీలకు విరివిగా రుణాలివ్వండి

### బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ, మైనారిటీలకు మెరుగైన జీవనోపాధులే లక్ష్యంగా ఆయా కార్పొరేషన్ల ద్వారా విరివిగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.61.25 కోట్ల రుణాలు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 916 క్రిస్టియన్, ముస్లీం మైనారిటీలకు రూ.14 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఫిబ్రవరి ఏడో తేదీ లోపు సచివాలయ పరిధిలోని డిజిటల్ అసిస్టెంట్ల సహకారంతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



# సరస్వతీ క్షేత్రానికి హరితహారం

● నాలుగోసారి జాతీయ హరిత అవార్డుకు కల్లూరు పాఠశాల ఎంపిక





కల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను మరోసారి హరితహారం వరించింది. కేంద్ర పర్యావరణశాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే పోటీల్లో హరిత పాఠశాలగా నాలుగోసారి ఎంపికైంది.సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ వారిచే జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రీన్ ఆడిట్లో కల్లూరు పాఠశాల గ్రీన్ అవార్డుకు ఎంపికైంది.ఈనెల 4న న్యూఢిల్లీలో ఇండియా హబిటేట్ (సీఎస్ఈ) నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందుకునేందుకు పాఠశాలలోని గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులుకు ఆహ్వానం అందినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు.నాల్గవసారి అవార్డును సాధించడంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరంతర కృషి చేశారు. నీటి వినియోగం, నేల సంరక్షణ, పచ్చదనం, వ్యర్థాల నిర్వహణ, గాలి నాణ్యత తదితర కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నారు. దీంతో మొదటి సారిగా 2019లో హరిత పాఠశాల జాతీయ అవార్డుకు ఎంపికైంది. అనంతరం 2022లో రెండోసారి, 2024లో మూడోసారి, 2025లో నాలుగోసారి జాతీయ అవార్డుకు ఎంపిక కావడం గమనార్హం.

### అవార్డుతో ఎంతో ఆనందం



కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల నాలుగోసారి హరిత అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఎన్జీసీ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నాం. గ్రీన్ కార్ప్స్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

- హెచ్ఎం శ్రీవాణి

### కల్లూరు పాఠశాలకు గుర్తింపు



జాతీయ స్థాయిలో నాలుగోసారి హరిత అవార్డు రావడంతో కల్లూరు పాఠశాలకు మరింత గుర్తింపు లభించింది. పాఠశాల తోటను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంలో విజయం సాధించాం. విజయంలో విద్యార్థుల కృషి ఎంతో ఉంది.

- రాజేంద్ర, డివిజనల్ కన్వీనర్

### దాతల సహకారం మరువలేనిది



కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంలో దాతల సహకారం ఎనలేనిది. పాఠశాలలో నిర్వహించే ఎన్జీసీ కార్యక్రమాల్లో తల్లిదండ్రులు, దాతలు, ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావడంతోనే అవార్డులు సాధిస్తున్నాం.

- వెంకటశిద్దులు, గ్రీన్ మాస్టర్

# ఓంశక్తి భక్తులకు విద్యుత్ షాక్

**తీవ్రగాయాలతో ఆస్పత్రికి ముగ్గురి తరలింపు - తప్పిన పెను ప్రమాదం**





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శెట్టేరి బాబు, వరుణ్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ముగ్గురు ఓంశక్తి భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి బంగారుపాళ్యం మండలంలోని జంబువారిపల్లె దళితవాడలో ఓంశక్తి అమ్మవారి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్నారు. గ్రామంలోని చర్చి వద్దకు వచ్చేసరికి తక్కువ ఎత్తులో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తూ చిత్రపటానికి పెట్టిన గొడుగుకు తగిలాయి. ఆ సమయంలో ట్రాక్టర్‌లో ఉన్న ఓంశక్తి భక్తులు శెట్టేరి బాబు, వరుణ్, గణపతిలకు విద్యుత్ షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ముఖం, కాళ్లు, వీపు, చేతులపై గాయాలయ్యాయి. తొలుత బాధితులను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌లో 30మందిపైగా భక్తులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ముగ్గురు తప్ప మిగిలినవారు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఏడీ కొండయ్య, ఏఈ దేవీప్రసన్న తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని 11 కేవీ విద్యుత్ తీగలను ఎత్తు పెంచి.. మరమ్మతులు చేపట్టారు.

### బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి.. గ్రామానికి చేరుకున్న శెట్టేరి బాబు, గణపతిలను శనివారం మధ్యాహ్నం పూతలపట్టు టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్‌తో కలిసి ఎమ్మెల్యే మురళీమోహన్ పరామర్శించారు. విద్యుత్ ఏడీని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. జంబువారిపల్లె ఉపసర్పంచ్ కమలనాథరెడ్డి బాధితులకు ఆర్థికసాయం అందించారు. వీరివెంట టీడీపీ నాయకులు జనార్ధన్ గౌడ్, సూరినాయుడు, మణి, మోహన్ రాజ్, ఎంపీడీవో శ్రీధర్, అధికారులున్నారు.

## మూడు నెలల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో రానున్న మూడు నెలల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతి, డిమాండ్ సర్వే అంశాలపై శనివారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్ పీడీ, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 5న చిత్తూరు, నగరి, 6న పలమనేరు, కుప్పం నియోజకవర్గాలపై సమీక్షిస్తామని చెప్పారు. 7వ తేదీని డీపీఆర్‌లను ప్రభుత్వానికి పంపాలన్నారు. గృహ నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ కలెక్టర్‌కు వివరించారు. ● సామాజిక పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని, ఇంటి వద్ద లబ్ధిదారులు అందుబాటులో లేకుంటే అధికారుల ద్వారా గుర్తించి పంపిణీ చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

## జాతీయ స్థాయిలో పుత్తూరు వాకర్స్‌కు గుర్తింపు



ప్రమాణ స్వీకారం చేస్తున్న రావిళ్ల మాధవనాయుడు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో పుత్తూరు వాకర్స్‌కు గుర్తింపు రావడం అభినందనీయమని ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రభావతి పేర్కొన్నారు. శనివారం పుత్తూరు వాకర్స్ భవనంలో జరిగిన ఇంటర్నేషనల్ వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ బాడీ అధ్యక్ష, డైరెక్టర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ పుత్తూరు వంటి చిన్న పట్టణంలో వాకర్స్ అసోసియేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ గవర్నర్‌గా రావిళ్ల మాధవ నాయుడు, డిప్యూటీ గవర్నర్‌గా లక్ష్మీనారాయణ మూర్తి(పుత్తూరు), వి.శాంతి(తిరుపతి), వి.భాస్కర్‌రాజు(బెంగళూరు), ఏజీ పాండియన్(తమిళనాడు), డైరెక్టర్లుగా పి.రామచంద్రయ్య నాయుడు, రఘునాథ రెడ్డి, శ్రీరాములు, కోశాధికారిగా పి.ఎస్.కృష్ణం రాజు, కార్యదర్శిగా మునికృష్ణయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్, సంకల్ప వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ డాక్టర్ పి.రవిరాజు, ఏరియా త్రి వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి గౌడ్, రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ, గవర్నర్ 102 రామరాజు, శరత్‌కుమార్ రాజు, లక్ష్మీనారాయణ, పుత్తూరు అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్ మూర్తి, రఫీ, ఉషోదయ వాకర్స్ ఫౌండర్ కోనేటి రవిరాజు, శ్రీధర్ రాజు, శ్రీనివాసులు, మునికృష్ణయ్య, కోశాధికారి గుణశేఖర్‌రెడ్డి, గోపి, కుప్పయ్య శెట్టి, దశరథరామయ్య, సుబ్రమణ్యం నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో వేడెక్కిన రాజకీయం

**డిప్యూటీ మేయర్ ఎన్నికతో అనూహ్య పరిణామాలు**

తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో శనివారం తిరుపతి పొలిటికల్ హైడ్రామాకు వేదికైంది. వైసీపీ నుంచి డిప్యూటీ మేయర్‌గా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ రెడ్డిని రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో 20 మంది కార్పొరేటర్లతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. శేఖర్ రెడ్డి నేతృత్వంలో క్యాంపు రాజకీయాల్లో ఆరితేరిన వారిని రంగంలోకి దింపి తమిళనాడు రిసార్ట్స్‌లో రెస్ట్ తీసుకుంటున్నారు. ఇంతలో ఊహించని పరిణామాలు తిరుపతిలో చోటు చేసుకున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి చేరుకుని డిప్యూటీ మేయర్ ఎన్నికపై కూటమి నేతలలో చర్చిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి నగర పాలకసంస్థ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించడంతో రాజకీయ రగడ మొదలైంది. ముఖ్యంగా శేఖర్ రెడ్డి ఆస్తులపై ఫోకస్ పెట్టడంతో వైసీపీ శ్రేణులు కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇంతలో ఏమైందో శేఖర్ రెడ్డి టీడీపీలో చేరేందుకు సిద్ధపడ్డారు. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి సమక్షంలో కూటమి పెద్దలతో మంతనాలు జరిగినట్లు తెలిసింది. ఆదివారం శేఖర్ రెడ్డి టీడీపీలో చేరబోతున్నట్లు తెలుస్తోంది. కాగా, శనివారం సాయంత్రం వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి నాయకుల చర్యలను తప్పుబట్టారు. మరో వైసీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కరరెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. తమ హయాంలో ఇలాంటి కుట్రపూరిత పనులు చేయలేదని, ఎవరిమీదా కేసులు పెట్టలేదని చెప్పుకొచ్చారు. అయితే గత మున్సిపల్ ఎన్నికల సమయంలో టీడీపీకి చెందిన ఆర్సీ శ్రీనివాసులు తన భార్య కార్పొరేటర్‌గా పోటీ చేస్తుందన్న కారణంగా అతని జీవనాధారమైన టీషాపును తొలిగించిన ఘటనను పలువురు ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు. ఇదిలా వుండగా కూటమి పార్టీ నుంచి అభ్యర్థిపై కసరత్తు జరుగుతోంది. టీడీపీ నుంచి గెలిచిన ఒకే ఒక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, అసమ్మతి కార్పొరేటర్లను కూటమి వైపునకు తీసుకొచ్చేందుకు కృషిచేసిన నర సింహాచారి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఈనెల 3న జరగబోయే డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఇంకెన్ని విచిత్రమైన పరిణాలు చోటుచేసుకుంటాయో చూడాల్సి ఉంది.

## బాలాలయ ప్రతిష్ఠకు అంకురార్పణ



పూజాద్రవ్యాలను యాగశాలకు తీసుకొస్తున్న ఈవో పెంచలకిషోర్, సిబ్బంది

ఐరాల (కాణిపాకం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో అనుబంధంగా ఉన్న వీరాంజనేయ స్వామి బాలాలయ ప్రతిష్ఠకు శనివారం సా యంత్రం అర్చక,పండితులు అంకురార్పణ నిర్వహించా రు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయ ఆలయం పక్కన యాగశాలను ఏర్పాటు చేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, పాలిక ఆరాధన, నివేదన,తీర్థాగోష్ఠిని అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


విజేతలైన విద్యార్థులతో బీసీ నాగరాజ్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవచ్చని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, కేడీసీ చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ అన్నారు. కుప్పం డిగ్రీ కళాశాలలో శనివారం ఖేలో కేడీసీ పేరుతో వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం కలగడమే కాకుండా స్పోర్ట్స్ కోటా కింద మంచి ఉద్యోగావకాశాలు పొందొచ్చని చెప్పారు. చదువుతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన పెరేడ్, పిరమిడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్వీయూ క్రీడల్లో రాణించి జోనల్ లెవెల్‌కు ఎంపికైన విద్యార్థులను బీసీ నాగరాజ్ అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేడీసీ వైస్ చైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూర్మాయిపురంలో తీరిన దాహార్తి


కుళాయిలు ప్రారంభిస్తున్న ముఖేశ్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 14వ వార్డు పరిధిలోని కూర్మాయిపురం ప్రజల దాహార్తి ఎట్టకేలకు తీరింది. దళిత వాడ అయిన కూర్మాయిపురంలో తాగునీరు సరిగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక నాయకులైన టీడీపీ కొత్తపేట ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆధ్వర్యంలో కొంత మంది కలిసి ఈ సమస్యను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు మున్సిపల్ నిధులతో శనివారం పైపులైన్ వేయించి కుళాయిలు ఏర్పాటు చేశారు. దాహార్తి తీరడంతో కూర్మాయిపురం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో అప్పు కొత్తపేట టీడీపీ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునెప్ప, 15వ వార్డు పార్టీ అధ్యక్షుడు సుకుమార్, బూత్ ఇన్‌చార్జి రాహుల్, మనోహర్, నవీన్, భరత్ పాల్గొన్నారు.

## జనసేన సోమల సభకు తరలిరండి

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం సోమల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించనున్న జనసేన బహిరంగ సభకు తరలి రావాలని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు, పార్టీ కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ పాల్గొనే సభకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సిమెంటు రోడ్డుకు భూమిపూజ


మటార్లపల్లె సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణదాసనపల్ల పంచాయతీ మట్లార్లపల్లె గ్రామంలో శనివారం సిమెంటు రోడ్డు నిర్మాణానికి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాబోయే అయిదేళ్లలో కుప్పం అంతులేని అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెక్కునత్తం మణి, సంతోష్, స్థానిక నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి, యూనిట్ ఇన్‌చార్జి, నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఈఆర్‌బీ బాలాజీ, పంచాయతీ అధ్యక్షుడు మురళీ, హుసేన్ సాహెబ్, శరవణ, ప్రభు, కుమార్ పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి సహకరించండి


మంత్రులను కలిసిన చల్లా

రొంపిచెర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని పలు రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని.. రోడ్ల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. శనివారం రాయచోటిలో రవాణ, యువజనశాఖ మంత్రి రామప్రసాద్‌రెడ్డి, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిలను చల్లా రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుంగనూరు- రొంపిచెర్ల రోడ్డు విస్తరణ పనులు, సోమల- పెద్దఉప్పరపల్లె, రొంపిచెర్ల మండలంలో తలుపుల క్రాస్ నుంచి పెద్దమల్లెల, రొంపిచెర్ల మీదుగా ఎర్రావారిపాలెం సరిహద్దు వరకు డబుల్ రోడ్డు పనులు చేయాల్సి ఉందన్నారు. అలాగే నియోజకవర్గంలోని సమస్యలు వివరించారు.

## ఘనంగా మడివేలు మాచయ్య జయంతి


మాచయ్యకు పూజలు చేస్తున్న రజకులు

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రజకుల దైవం మడివేలు మాచయ్య జయంతిని ఆ కులస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. కుప్పం పురపాలక సంఘం బైరుగానిపల్లె ఐలమ్మ దోబీ ఘాట్‌లో మాచయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. సీఆర్.మోహన్, రంగనాథ్, జి.నరసింహులు, దయాకర్, చలపతి, విజయ్ కుమార్, మురళీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబును కలిసిన చల్లా


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడును శనివారం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డిలతో కలిసి సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికి మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

## బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీ ఆధారిత స్వయం ఉపాధి పథకంతో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలో బీసీలకు 90 యూనిట్లు, కాపులకు 20 యూనిట్లు, రెడ్డి, కమ్మలకు 5, ఈబీసీ. బ్రాహ్మణులకు రెండేసి, కాపు ఎంఎస్ఎంఈ, క్షత్రియ, వైశ్యలకు ఒక్కోటి చొప్పున మొత్తం 129 యూనిట్ల రుణాలు మంజూరైనట్లు చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాసుపుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆన్‌లైన్‌లో రుణాల కోసం ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సోమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రబోధ సేవా సమితి కార్యకర్తలు శనివారం మండలంలోని పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లెల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రజలకు వివరించారు.

## కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలి

సోమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్మూలకు ప్రతిఒక్కరూ సహకరించాలని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. శనివారం వైద్యసిబ్బంది కందూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారి డాక్టర్ నీలిమా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## విరూపాక్షమ్మ ఆలయంలో పూజలు

సోమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గల్లావారిపల్లెలో నూతనంగా నిర్మించిన విరూపాక్షమ్మ ఆలయంలో శనివారం పూజలు చేపట్టారు. ఉదయం గణపతి హోమం జరిగింది. ఆలయ ధర్మకర్తలు గల్లా వరదరాజు, రెడ్డిశేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేడు నాగబాబు బహిరంగ సభ

సోమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సోమల హైస్కూల్ సమీపంలో ఆదివారం జనసేన పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పుంగనూరు జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సభకు రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు హాజరవుతారని.. సూరయ్యగారిపల్లెలో పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సోమలలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, చిన్నారాయల్, శివకుమార్‌రెడ్డి, విరూపాక్షి పాల్గొన్నారు.

## పుంగనూరు నియోజకవర్గ రజక సంఘ అధ్యక్షుడిగా రమేష్


రాష్ట్ర రజక సంఘ అధ్యక్షుడు షణ్ముగం నుంచి నియామకపత్రం అందుకుంటున్న రమేష్

పుంగనూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ రజక సంఘ అధ్యక్షుడిగా సి.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర రజక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పి.షణ్ముగం తెలిపారు. శనివారం చిత్తూరులో జరిగిన రజక సంఘ సభ్యుల సమావేశంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా ఉపాధ్యక్షుడుగా పుంగనూరుకు చెందిన నాగరాజును ఎన్నిక చేసినట్లు ఆయన వివరించారు.

## చంద్రబాబును కలిసిన సుహేల్‌బాషా


సీఎం చంద్రబాబును కలిసిన పుంగనూరు మైనారిటీ నాయకుడు సుహేల్‌బాషా

పుంగనూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను పుంగనూరు టీడీపీ మైనారిటీ నాయకుడు సుహేల్‌బాషా కలిశారు. శనివారం తాడేపల్లె సచివాలయంలో వారితో కలిసి పుంగనూరు మైనారిటీల సమస్యలు వివరించినట్లు తెలిపారు. మైనారిటీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## పెద్దిరెడ్డిపై ఆరోపణలు తగదు

పుంగనూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ప్రభుత్వ, అటవీ భూములు ఆక్రమణ చేశారని అసత్య ఆరోపణలు చేయడం తగదని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ సీఎం జగన్, పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. వాస్తవంగా వారు భూములు ఆక్రమించి ఉంటే రెవెన్యూ, అటవీశాఖ, ఎండోమెంట్ అధికారులు పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో వైసీపీ నాయకులు షరీఫ్, హేమచంద్ర, బాబునాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత కుప్పమే లక్ష్యం

### ● అర్బన్ సీఐ పి.శంకరయ్య



కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణాన్ని, మండలాన్ని గంజాయి రహిత, ప్రశాంత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కుప్పం అర్బన్ సీఐ పి.శంకరయ్య అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాల మేరకు 'స్మార్ట్ వర్క్'తో, శాంతిభద్రతల రక్షణ ప్రథమ కర్తవ్యమంటున్నారు. సీఐతో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి క్లుప్తంగా...

**● గంజాయి, సారా రహితంగా చేస్తాం**

కుప్పం మండలంలో ఎక్కడా గంజాయి సాగు, విక్రయాలనేది లేకుండా తగు చర్యలు తీసుకుంటాం. తమిళనాడు సరిహద్దుల్లోని మారుమూల గ్రామాల్లో అక్కడక్కడా అడవుల్లో, పొలాల్లో గంజాయి సాగు చేస్తున్న ఆనవాళ్లు గతంలో దొరికాయి. ఆయా ప్రాంతాలపై గట్టి నిఘా పెట్టి, ఎక్కడా గంజాయి లేకుండా నిర్మూలిస్తాం. గంజాయి సాగు చేసినా, విక్రయించినా, సేవించినా క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇదే రీతిలో నాటుసారాపై ఉక్కుపాదం మోపుతాం.

**ఫటా ఫట్?**

**● సీసీ కెమెరాల ఏర్పాటుతో రక్షణ**

ఇటీవల కుప్పంలో దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో వాటి అదుపునకు చర్యలు తీసుకుంటాం. వ్యాపార సముదాయాలు, నివాస గృహాలలో ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అలాగే స్మార్ట్ లాక్‌లు అమర్చుకోవాలి. ఈ రెండింటితో దొంగతనాల వంటి నేరాలు అదుపులోకి వస్తాయి. ముఖ్యమంత్రి చెప్పినట్లు అందుబాటులో ఉన్న సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుని, నేర నియంత్రణ చేయడానికి కృషి చేస్తాం. దీనికి ప్రజలు సహకరించాలి. నగదు, విలువైన ఆభరణాలు ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లు తీసుకుని వాటిలో భద్రపరచుకోవాలి.

**● ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

కుప్పం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ప్రధాన రహదారులైన నేతాజీ రోడ్డు, ప్యాలెస్ రోడ్డు, రామచంద్ర రోడ్డు తదితర ప్రాంతాలు నిత్యం జనం, వాహనాల సమ్మర్దంతో కిటకిటలాడుతుంటాయి. వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా జరడంతో మరింత ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ముందుగా ప్రధాన రహదారులు, రద్దీ ఎక్కువగా ఉన్న రోడ్లలో వన్‌సైడ్ పార్కింగ్ అమలు చేస్తాం. రోడ్డుపై ముందుకొచ్చిన దుకాణాలను మున్సిపల్ అధికారుల సహకారం తీసుకుని మార్జిన్ వేసి లోపలకు సర్దుతాం. ఈ చర్యలు తీసుకోవడంతో రోడ్లు కొంత విశాలంగా మారి ట్రాఫిక్ నియంత్రణలోకి వస్తుంది. వ్యాపారులు, దుకాణదారులు, ప్రజలు సహకరించాలి.

**● నిర్దేశిత సమయాల్లోనే లోడింగ్, అన్ లోడింగ్**

కుప్పం పట్టణం చాలా చిన్నది. ఇక్కడ ఇరుకైన వీధులు, రోడ్లు చాలా ఉన్నాయి. ఈ రోడ్లపై ఎప్పుడంటే అప్పుడు భారీ వాహనాలను అడ్డంగా నిలబెట్టి వివిధ రకాల సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం గమనించాం. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. నిర్దేశిత సమయాల్లోనే లోడింగ్, అన్‌లోడింగ్‌లు జరిగేలా చేయాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై వ్యాపార సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు తీసుకుంటాం. ఉదయం 8.30 లోపు మళ్లీ రాత్రి 8.30 గంటలపైన సరుకుల లోడింగ్, అన్ లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నాం. వ్యాపారులు దీనికి సహకరించాలి.

**● అతివేగం, హారన్ల మోతలపై కఠినంగా వ్యవహరిస్తాం**

యువత, ద్విచక్ర వాహనాల్లో అతి వేగంగా వెళ్తూ పలురకాల అరుపులతో కూడిన హారన్లు మోగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకంగా పోలీసులతో పహారా ఏర్పాటు చేసి అటువంటి ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తాం. జరిమానాలు , పబ్లిక్ న్యూసెన్స్ కేసులు నమోదు చేస్తాం. చిన్నపిల్లలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తాం.

## కూటమి ప్రభుత్వంలో సకాలంలో పింఛన్లు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సకాలంలో పింఛన్ల పంపిణీ జరుగుతోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులూపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, కిరణ్, మదనమోహన్‌రెడ్డి, సహదేవ, సూరిశెట్టి సురేంద్ర పాల్గొన్నారు.

●కల్లూరు: పులిచెర్ల మండలంలో పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. మండలంలోని కల్లూరు సచివాలయ సిబ్బంది చేస్తున్న పింఛన్ల పంపిణీని శనివారం ఉదయం ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తనిఖీ చేశారు.

● సోమల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా చూడాలని ఎంపీడీవో నారాయణ సూచించారు. శనివారం దిడ్డివారిపల్లె, చెన్నయ్యగారిపల్లె, సోమలలో పలు చోట్ల చేపట్టిన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

● సోమల: సోమల మండలంలో కొత్తగా మంజూరైన 20 పింఛన్లను శనివారం పంపిణీ చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జయశంకర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, టి.శ్రీనివాసులు, నౌషాద్, బాబయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

●పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో శనివారం 96.10 శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో 4,564 మందికి గాను శనివారం 4,386 మందికి పెన్షన్లు పంపిణీ చేశామని.. మిగిలిన వారికి ఆదివారం పంపిణీ చేస్తామని కమిషనర్ తెలిపారు.

● చౌడేపల్లె: మండలంలో శనివారం 96 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. 6,558 మంది గాను 6,286 మందికి పంపిణీ చేశామని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


శివకుమార్ మృతదేహం

చౌడేపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. చదళ్లకు చెందిన శివకుమార్ పొదళ్లపల్లెకు సమీపంలో ఓ కోళ్లఫారంలో పనులు చేసుకుంటున్నాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో కోళ్లఫారం సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చౌడేపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. మండలానికి 56 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## 8న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ ఆరీఫా

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న పుంగనూరులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీకి అనువైన క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేలా కక్షిదారులతో సంప్రదించాలన్నారు. రాజీ చేసుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తి వంశీకృష్ణ, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తుర్లపల్లె పంచాయతీ నగిరేపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి గుండెపోటుతో వారం రోజుల క్రితం మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని పలమనేరు శాసన సభ్యులు శనివారం పరామర్శించారు. పార్టీ కోసం ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. నాయకులు రోజారెడ్డి, నాగరాజరెడ్డి, మణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి వంట పాత్రల వితరణ


ఆలయానికి వంట పాత్రలు అందజేస్తున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయానికి విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు వంట పాత్రలను వితరణ చేశారు. శనివారం స్థానిక ఆలయ అర్చకులు, టీటీడీ సెక్యూరిటీ సిబ్బందికి పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను టీటీడీ విజిలెన్స్ అధికారిగా పని చేశానని, ఆలయంలో జరిగే ప్రతి కార్యక్రమానికి వస్తుంటానని, అనేక పర్యాయాలు భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఆలయంలో భక్తులకు ప్రసాదాలు తయారు చేయడానికి అవసరమైన పాత్రలు, గ్యాస్ స్టౌవ్‌ను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


ఈడీకి ఫిర్యాదు చేస్తున్న రజకసంఘ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు దోబీఘాట్ రోజురోజుకు దురాక్రమణకు గురవుతోందని.. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని చిత్తూరు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవికి రజక సంఘ నేతలు శనివారం ఫిర్యాదు చేశారు. చిత్తూరులో ఈడీని కలిసి ఆక్రమణలు అరికట్టి దోబీఘాట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వారం రోజుల్లో తాను పరిశీలించి ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు రూ. 3 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు రమేశ్, నాగరాజ, గణేశ్, శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హతతోనే రెస్కోలో ఉద్యోగాలు

కుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కో సంస్థలో తగిన అర్హత పొందే ఉద్యోగాలు చేస్తున్నామని తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు. రెస్కోలో జరిగిన కొన్ని పనుల కారణంగా వివిధ ప్రభుత్వరంగ సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారన్నారు. విచారణకు పూర్తిగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. విచారణలో ఏదైనా తప్పు అని తేలితే శాఖాపరమైన విచారణ, చర్యలు ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. నిజానిజాలు విచారణ నివేదిక బహిర్గతమయ్యాకే బయట పడుతాయని, ఆలోపు లేనిపోని అపోహలు సృష్టించి తమ ఆత్మస్థైర్యాన్ని ఎవరూ దెబ్బ తీయొద్దని విన్నవించారు. అయితే విచారణ నివేదికను రెస్కో జనరల్ బాడీ సమావేశంలో పెట్టి బహిర్గత పరచాలని రెస్కో ఉన్నతాధికారులను ఆదేశించినట్లు జిల్లా సహకార శాఖ అధికారులు చెబుతున్నారు. మరి ఉద్యోగులు కోరుకున్నట్లుగా నివేదిక ఎందుకు బహిర్గతం చేయలేదో అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది.

## ఫీజుపోరు పోస్టర్ల విడుదల

పలమనేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శనివారం వైసీపీ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు ఈనెల 5వ తేదీన వైసీపీ చేపడుతున్న ఫీజుపోరు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ విడుదల చేశారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దిగువపోకవారిపల్లి పంచాయతీ ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఉదయం ద్విచక్రవాహనాన్ని వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కల్లూరు పోలీసుల కథనం మేరకు.. సదుం మండలం తాటిగుంటపాళ్యం పంచాయతీ ఎర్రగుంటపల్లికి చెందిన రాజారెడ్డి (45) స్వగ్రామం నుంచి తన స్కూటీలో పీలేరు వైపు వెళుతున్నాడు. ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో రాజారెడ్డికి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్తయిండ్లులో పట్టపగలే చోరీ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కొత్తయిండ్లులోని ఓ ఇంట్లో పట్టపగలే దుండగులు తలుపులు బద్దలు కొట్టి చోరీ చేసినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు శనివారం సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా... పట్టణంలోని కొత్తయిండ్లుల్లో కాపురం ఉన్న చౌడేపల్లె ఎంఈవో కేశవరెడ్డి గత నెల 26న ఇంటికి తాళాలు వేసుకుని పట్టణ సమీపంలోని రాగానిపల్లెకు బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీసిఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంట్లో పరిశీలించగా బీరువా ధ్వంసం చేసి అందులోని 24 గ్రాముల బంగారం, రూ.16 వేలు నగదు, 40 గ్రాముల వెండి చోరీ జరిగిందని గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## బడ్జెట్‌పై అన్నారిలా..

### మధ్య తరగతికి పెద్దపీట

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, మధ్య తరగతి వారికి పెద్ద పీట వేశారు. అన్ని రంగాలకు, శాఖలకు సముచిత కేటాయింపులు చేశారు. విభజనతో, గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో ఆర్థిక లోటులో ఉన్న రాష్ట్రాన్ని మరింత ప్రత్యేకంగా ఆదుకోవాలని పీఎం మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలమ్మను కోరుతున్నాను.

- జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

### పోలవరానికి ప్రాణం పోశారు

కేంద్ర బడ్జెట్ ద్వారా విశాఖ ఉక్కుకు, పోలవరానికి ప్రాణం పోశారు. విశాఖ స్టీల్‌ను అమ్మేసి భూములను కేటాయించుకోవాలనుకుని గత వైసీపీ ప్రభుత్వం తాపత్రయ పడింది. నేడు కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది.కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందనడానికి ఇదే నిదర్శనం.

- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ

### ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేసేలా

దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేసేలా కేంద్ర బడ్జెట్ వుంది. ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ఉంది. రైతులకు వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా వుంది.

- సురేంద్రకుమార్, టీడీపీ అధికార ప్రతినిధి

### సామాన్యులకు ఊరట

పన్ను మినహాయింపు రూ.12 లక్షల వరకు పెంచి సామాన్యులకు ఊరట కలిగించారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అనే నినాదాన్ని మాటలకే పరిమితం చేయకుండా ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా బడ్జెట్ ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు బాగా ఉపయోగపడుతుంది.

- కటారి హేమలత, చుడా చైర్‌పర్సన్

## టీడీపీ అంటేనే అభివృద్ధి: ఎమ్మెల్యే జగన్మోహన్



నలంద నగర్‌లో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అంటేనే అభివృద్ధి అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. శనివారం నగర పరిధిలో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చిత్తూరులో ఐదేళ్లలో అభివృద్ధి అనే మాటను ప్రజలు మర్చిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే పనులు చేసి, చూపిస్తున్నామని తెలిపారు. నలంద నగర్‌లో సిమెంటు రోడ్డు, జయనగర్‌కాలనీలో కాలువ, తిమ్మారెడ్డి సర్కిల్‌లో గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ, దుర్గానగర్‌కాలనీలో డ్రైనేజీ, పలమనేరు రోడ్డు, సంతపేట, పాంచాలిపురంలలో కాలువలను ప్రారంభించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగరపాలక అధికారులు, కార్పొరేటర్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## శేష జీవితం ఆనందంగా గడపండి

### ఉద్యోగ విరమణ చెందిన సిబ్బందితో ఎస్పీ



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శేష జీవితం ఆనందంగా గడపాలని ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ మణికంఠ అన్నారు. శనివారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ నటరాజ, హెడ్‌కానిస్టేబుళ్లు మునిరాజులు, మునిరత్నంలను ఆయన సన్మానించారు. విశ్రాంత పోలీసులు, కుటుంబీకుల కోసం ఆరోగ్యపరంగా అత్యవసర సమయాల్లో ఒక వాహనాన్ని అందుబాటులో ఉంచామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాష, చిన్నికృష్ణ, ఎస్బీ సీఐలు భాస్కర్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

**డైరీ ఆవిష్కరణ:** పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో 2025 పోలీసు డైరీని ఎస్పీ ఆవిష్కరించారు. ఏఎస్పీ, ఏఆర్ డీఎస్పీలు, ఎస్బీ సీఐలు, ఆర్ఐలు భాస్కర్, సుభాకర్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల ఆపద్బాంధవుడు చంద్రబాబు: ఎమ్మెల్యే మురళీమోహన్



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మురళీమోహన్

పూతలపట్టు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. వావిల్‌తోట దళితవాడలో రూ.2.30లక్షలతో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా గోకులం షెడ్లను ఏర్పాటు చేసేందుకు తమవంతు కృషిచేస్తానన్నారు. పూతలపట్టు మండలంలో 60కిపైగా గోకులం షెడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. వావిల్‌తోట దళితవాడలో ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోకులం షెడ్లతోపాటు రూ.17 లక్షల నిధులతో డ్రైనేజీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, ఎంపీడీవో నాగరాజు, ఏపీఎం సంధ్యారాణి, నాయకులు మధు, దేవేంద్ర రెడ్డి, రామమూర్తి నాయుడు, గోవర్ధన్, నాదముని, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ రాష్ట్ర చాంపియన్‌గా చిత్తూరు జట్టు



చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ రాష్ట్ర చాంపియన్‌గా చిత్తూరు జిల్లా జట్టు నిలిచింది. విజయవాడలో గత నెల 28 నుంచి 31వ తేదీవరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-23 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో మన జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపారు. దీంతో మన జట్టు రాష్ట్ర చాంపియన్‌గా నిలిచిందని జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్ బాబు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుతో హోరాహోరీగా తలపడి విజయం సాధించిందన్నారు. క్రీడాకారులకు శనివారం పలువురు అభినందనలు తెలిపారు.

## రేపు కాణిపాకంలో వసంత పంచమి వేడుకలు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని ఆస్థాన మండపంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో పెంచకిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా మహాసరస్వతి యాగం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేడుకల నిర్వహణ కోసం ఆస్థాన మండపాన్ని శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్లు వాసు,కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఈవో పెంచలకిషోర్

## రేపు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

విజయపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాధవరం ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లొమో, ఇతర కోర్సులు పూర్తి చేసినవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమవెంట ధ్రువీకరణ పత్రాలతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

## పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లె పంచాయతీలోని బంగారెడ్డిపల్లెలో లబ్ధిదారులకు పింఛను సొమ్మును శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్ అందజేశారు. లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడకు ఫించను అందే ఏర్పాటు చేసింది కూటమి ప్రభుత్వం అని చెప్పారు. జిల్లా టీడీపీ నేత చంద్రప్రకాష్, నాయకులు మోహన్‌రాజ్, మేషాక్, జగదీష్ నాయుడు, సామివేల్ తదితరులు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** పచ్చికాపల్లంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మాల కార్పొరేషన్ మెంబరు డాక్టర్ యుగంధర్ పొన్న పంపిణీ చేశారు.



కుప్పాలపల్లె- మంగళపల్లె రోడ్డు దుస్థితి


## రహదారి.. గుంతలమయం

### ఇబ్బంది పడుతున్న స్థానికులు

కుప్పాలపల్లె నుంచి మంగళపల్లెకు వెళ్లే దారిలో గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద రోడ్డు పెద్దపెద్ద గుంతలతో నిండిపోయింది. 3.5 కిలోమీటర్లు ఉండే ఈ రహదారి చాలావరకు ఇలాగే ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి లోకేశ్‌కు మంగళపల్లె సర్పంచ్ కుప్పాల మురళి వినతి పత్రం కూడా అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

- బంగారుపాళ్యం, ఆంధ్రజ్యోతి

## పులిగుండుకు నిప్పు



పులిగుండు వద్ద కాలుతున్న చెట్లు, కమ్మేసిన పొగ

పెనుమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పులిగుండు కొండకు ఆకతాయిలు శనివారం సాయంత్రం నిప్పు పెట్టారు. దీంతో కొండ చుట్టూ ఉన్న చెట్లు మంటల్లో కాలిపోయాయి. దీంతోపాటు అనేక జీవరాసులు మాడి మసైపోయాయి. టూరిజం భవనాలు, పులిగుంటీశ్వర ఆలయం వరకు ఈ మంటలు వ్యాపించడంతో అక్కడివారు భయభ్రాంతులకు గురయ్యారు. మంటలు మాత్రం రాత్రయినా ఆగలేదని స్థానికులు తెలిపారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం: నగరి డీఎస్పీ



స్వాధీనం చేసుకున్న బైకుల వద్ద డీఎస్పీ మహమ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరి సబ్ డివిజన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ తెలిపారు. శనివారం వెదురుకుప్పం మండలం నక్కలాంపల్లెలో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, రాజ్‌కుమార్, సుమన్‌లతో కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్కలాంపల్లెలో సారా తయారీ, విక్రయాలు, రవాణా జరుగుతున్నట్లు, రికార్డులు లేని బైక్‌లు వంటి సమాచారం ఉండటంతో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. అలాగే గ్రామంలోని ప్రజలకు సారా జోలికెళితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించామని తెలిపారు.

**42 బైక్‌ల స్వాధీనం:** నక్కలాంపల్లెలో నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో సరైన రికార్డుల్లేని 42బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## కూలిన వాటర్ ట్యాంకు పైకప్పు



కూలిన వాటర్ ట్యాంకు పైకప్పును చూపుతున్న చెంగల్రాయులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట బీసీ కాలనీలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు పైకప్పు శిథిలావస్థకు చేరుకోవడంతో కూలిందని టీడీపీ ఎస్సీ సెల్ మండల ప్రధానకార్యదర్శి చంద్రగిరి చెంగల్రాయులు శనివారం తెలిపారు. ట్యాంకు దుస్థితిపై గతంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. దీంతో శుక్రవారం కూలిందని, ఆ శబ్దంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారని చెప్పారు. అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు.

## పెద్దిరెడ్డి అక్రమాలకు అంతే లేదా?: టీడీపీ

యాదమరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు అంతేలేదా అని టీడీపీ నేతలు శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'పెద్దిరెడ్డి.. మంత్రిగా ఉన్నప్పుడు ఇసుక, లిక్కర్, మైనింగ్ మాఫియాలతో వేలకోట్ల రూపాయలు దోచుకున్నారు. పులిచెర్ల మండలంలో అసైన్డ్ భూములు కాజేయడం, తిరుపతి విమానాశ్రయం దగ్గర వందెకరాల ప్రభుత్వ భూమి ఉంటే అందులో 20 ఎకరాలు ఆయన భార్య పేరు మీదకు ఎలా వచ్చాయన్న వివరాలు త్వరలోనే బయటకు వస్తాయి' అని టీడీపీ యాదమరి అధ్యక్షుడు మొరార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ్ నాయుడు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పవన్.. మీ ఎంపీలకు కారం ముద్దలు ఇవ్వలేదా?

### 'ఎక్స్' వేదికగా ప్రశ్నించిన మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రిక్తహస్తం చూపారంటూ మాజీమంత్రి ఆర్కేరోజా శనివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి కేంద్రంనిధులు మంజూరు చేయకపోవడంపై పవన్‌కల్యాణ్ తమఎంపీలను ఉద్దేశించి చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తుకుతెచ్చారు. రెండుకారం ముద్దలు తినండి, మరో రెండు కారం ముద్దలను ఒంటికి పూసుకుని పౌరుషం తెచ్చుకుని కేంద్రాన్ని నిలదీయండి అని చెప్పిన పవన్.. నేడు కూటమి ప్రభుత్వంఎంపీలకు ఎందుకు ఆ కారం ముద్దలు ఇవ్వలేదన్నారు.

## వాటర్ స్కీమ్‌ను పరిశీలించిన జడ్పీ సీఈవో

విజయపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇళ్లత్తూరులో రాజీవ్ సీడబ్ల్యూఎస్ వాటర్ స్కీమ్‌ను శనివారం జడ్పీ సీఈవో రవినాయుడు పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించడమే ఈ స్కీమ్ ఉద్దేశమన్నారు. అనంతరం ఎల్లసముద్రంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. డీఎల్‌డీవో రవికుమార్, ఎంపీడీవో రాజేంద్ర, కాంట్రాక్టరు బాలసుబ్రహ్మణ్యంరాజు, ఏఈలు, నాయకుడు ఏకుమలై పాల్గొన్నారు.

## టీడీపీ జీవితకాల సభ్యత్వ నమోదు



శ్రీరంగరాజుపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లెకు చెందిన జగదీశ్వర్ నాయుడు.. టీడీపీ జీవితకాల సభ్యత్వం తీసుకున్నారని ఎస్ఆర్‌పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు శనివారం తెలిపారు. అనంతరం జగదీశ్వర్‌నాయుడిని అభినందించారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ

పెనుమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ సుబ్రహ్మణ్యం శనివారం తనిఖీ చేశారు. మోపిరెడ్డిపల్లెలో కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గుణశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీడని పొగ మంచు



విజయపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని పొగ మంచు శనివారం కప్పేసింది. ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు ఉండటంతో రోడ్డుపై వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

## సబ్సిడీ రుణాల కోసం బీసీలు దరఖాస్తు చేసుకోండి

పెనుమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు సబ్సిడీ ద్వారా బ్యాంకు లోన్లు మంజూరు చేసిందని, అర్హులైన వారు సచివాలయంలో దరఖాస్తుచేసుకోవాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలానికి 75 యూనిట్లకు రూ.1.66 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-డీ, బీసీ-ఈ, ఈబీసీ అభ్యర్థులకు 21-60 ఏళ్ల వయసు ఉండాలన్నారు. బలిజ, తెలగ, ఒంటరి కులాలవారికి 21-50 ఏళ్ల మధ్య ఉండాలని చెప్పారు. ఈనెల ఏడో తేదీ చివరి గడువు అన్నారు.

**యాదమరి:** మండలానికి 61 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో వేణు తెలిపారు. అర్హులు సచివాలయంలో సంప్రదించాలన్నారు.

**గంగాధరనెల్లూరు:** మండలానికి 59 యూనిట్లకు రూ.1.35కోట్లు విడుదలైనట్లు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం తన చాంబర్‌లో వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమీక్షించారు. అర్హులకు త్వరగా రుణాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మన గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు



రైతులతో మాట్లాడుతున్న మురళీకృష్ణ, వనిత

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ శనివారం తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు రైతులకు పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించి, సూచనలిచ్చారు. జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. ఆయనవెంట వెదురుకుప్పం వ్యవసాయాధికారి వనిత ఉన్నారు.

## టీడీపీ నాయకుడికి నివాళి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం అమ్మపల్లె పంచాయతీ రాచపాళెంకు చెందిన గ్రామ స్థాయి టీడీపీ నాయకుడు రాజేంద్రయ్య(60) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శనివారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వీరిలో తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బీగాల రమేష్, కృష్ణాపురం జలాశయం చైర్మన్ మునికృష్ణయ్య అలియాస్ అన్నామలై ఉన్నారు.

## తూగుండ్రంలో డ్రైనేజీ పనుల పరిశీలన

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం హైస్కూల్ వద్ద ఆదిఆంధ్రవాడ నుంచి సమీపంలోని చెరువుకాల్వ వరకు రూ.9లక్షలతో డ్రైనేజీ పనులు పూర్తిచేశారు. ఈ పనులను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్ పరిశీలించారు. మండల ఏఈ ఈశ్వర్‌ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యువరాజ్, పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం టీడీపీ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులు రెడ్డి, ప్రధానకార్యదర్శి సంపత్, నేత రాఘవేంద్ర పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆకనంబట్టు గ్రామానికి చెందిన బాలచంద్ర, కళ్యాణి పని నిమిత్తం పూతలపట్టుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా రంగంపేట క్రాస్ రోడ్డు సమీపానికి వచ్చేసరికి తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలవడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి స్థానికులు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కళ్యాణిని చీలాపల్లె సీఎంసీకి తీసుకెళ్లారు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేశారు.

## ఆస్పత్రిలో ముగ్గురికి పింఛన్ల పంపిణీ

యాదమరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దిగువ కణతలచెరువుకు చెందిన సంపూర్ణమ్మపై గతమంగళవారం అర్ధరాత్రి ఒంటరి ఏనుగు దాడిచేయడంతో కాలు విరిగింది. ఈమె చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమెకు సాయంగా వచ్చిన మరో ఇద్దరు కూడా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛనుదారులు. విషయం తెలుసుకున్న డీకే చెరువు వీఆర్వో భానుచందర్, డిజిటల్ అసిస్టెంట్ జగదీష్‌లు శనివారం ఆస్పత్రికెళ్లి ముగ్గురికీ పింఛను సొమ్ము అందజేశారు. మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీవో వేణు తెలిపారు.



ఆస్పత్రిలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేసిన సిబ్బంది

## సంక్షిప్తంగా..

### అల్పాహారం వితరణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం తెనాలికి చెందిన హర్ష ఆదిత్య కృష్ణ కుటుంబీకుల వితరణతో భక్తులకు అల్పాహారం(టిఫిన్) పంపిణీ చేశారు. ఈ మేరకు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

**వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం:** వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏర్పాట్లను ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

### ఏపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అఖిల్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిత్తూరుకు చెందిన అఖిల్ ఎన్నికయ్యారు. శనివారం వైజాగ్‌లో ఏపీఎస్ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. అఖిల్ విద్యార్థి సంఘ నాయకుడిగా చేసిన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి తురక ప్రసాద్ పేర్కొన్నారు.

### నేడు వసంత పంచమి వేడుకలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మ ఆలయంలో ఆదివారం వసంత పంచమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు అర్చకుడు కేదారేశ్వరన్ తెలిపారు. విశ్వహిందూ పరిషత్ సహకారంతో సరస్వతీ దేవి పూజ, చిన్నారులకు అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

### టీడీపీ నేత జన్మదిన వేడుకలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మేషాక్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు, మోహన్‌రాజ్, శశికర్ బాబు, రఘు, కుమార్, రాజ, గురేష్, శ్రీనివాసులు, చెల్ల, గోవిందరాజులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాలోని పేద మహిళలకు హీరో (హెల్త్ ఎకానామిక్ రూరల్ ఆర్గనైజేషన్) సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ నిర్వాహకుడు పరదేశి తెలిపారు. వివరాలకు హీరో సంస్థ, అగరం పల్లె క్రాస్, ఐరాల (మం) లేదా 90143 85038 నెంబరును సంప్రదించాలని కోరారు.

### 'అమ్మఒడి'ని సందర్శించిన ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పాంచాలిపురంలో ఉన్న అమ్మఒడి ఆశ్రమాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శనివారం సందర్శించారు. ఆశ్రయం పొందుతున్న అనాథ వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఆశ్రమానికి స్థలం, భవన నిర్మాణానికి సాయం చేస్తానని చెప్పారు. నిర్వాహకుడు పద్మనాభనాయుడు దంపతులను అభినందించారు. ఆయనవెంట మేయర్ అముద తదితరులున్నారు.

### కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అక్బర్ బాషా



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ అక్బర్ బాషా నియమితులయ్యారు. ఈయన్ను డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, నాయకులు పరదేశి, ఉమేష్‌లు అభినందించారు.